సమయపాలన పాటించండి

• కలెక్టర్ కోయ శ్రీ హర్ష


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష, సంబంధిత అధికారులు

పెద్దపల్లిరూరల్: అందరూ సమయపాలన పాటించాలని, వారికి కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంఎల్‌హెచ్‌పీ పనితీరుపై ప్రోగ్రాం అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఎంఎల్‌హెచ్‌పీ తన పరిధిలో జరిగే 102 వాహనాల ద్వారా గర్భిణుల చెకప్ వంటి అంశాలను రివ్యూ చేసుకోవాలన్నారు. నూతనంగా జన్మించిన శిశువులకు అవసరమైన టీకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తూ అవసరమైన వారికి మందులు, కిట్లు అందించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రతీరోజు ఒక గ్రామం సందర్శించేలా ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ గ్రామంలో వైద్యుడు ఏరోజు అందుబాటులో ఉంటారో వారికి తెలిసేలా ఒకరోజు కేటాయించాలని, ఈ విధంగా షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతులను జైల్లో పెట్టడం అమానుషం


పెద్దపల్లిరూరల్: వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు


గోదావరిఖని: వినతిపత్రం అందజేస్తున్న చందర్


మంథని: వినతిపత్రం ఇస్తున్న పుట్ట మధు

పెద్దపల్లిరూరల్: భూములు ఇవ్వం అన్నందుకు లగచర్ల రైతులను జైల్లో పెట్టడం అమానుషమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్లు చంద్రశేఖర్, సరేశ్ పాల్గొన్నారు.

రైతులకు సంకెళ్లా?

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్నం పెట్టే రైతుల చేతులకు సంకెళ్లు వేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, నాయకులు బోడ్డుపల్లి శ్రీనివాస్, బోడ్డు రవీందర్, పర్లపల్లి రవి, జిమ్మిబాబు, నూతి తిరుపతి, తోకల రమేశ్, సట్టు శ్రీనివాస్, పిల్లి రమేశ్, కుడుదుల శ్రీనివాస్, ముద్దసాని సంధ్యారెడ్డి, యాసర్ల తిమోతి, నిట్టూరి రాజు, వడ్లూరి రాములు, వెంకన్న, అవునూరి వెంకటేశ్, కనకలక్ష్మి, గుంపుల లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అపహాస్యం చేస్తోంది

మంథని: కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. లగచర్ల రైతులను రేవంత్ సర్కార్ నుంచి కాపాడాలని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూడాలని కోరుతూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పుట్ట మధు వినతిపత్రం అందించారు. దేశానికి అన్నం పెట్టే రైతులను జైల్లో పెట్టిన చరిత్ర రేవంత్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. ఏగోళపు శంకర్‌గౌడ్, కనవేన శ్రీనివాస్, అరెపల్లి కుమార్, మంథని లక్ష్మణ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

ధర్మారం: లగచర్ల రైతులపై అక్రమ కేసులతోపాటు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపిస్తూ ధర్మారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని నిరసన తెలిపారు. మేడారం సింగిల్‌విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, నాయకులు ఎండీ రఫీ, దేవి నళినీకాంత్, నాడెం శ్రీనివాస్, కొత్త మోహన్, నారప్రేమ్‌సాగర్, ఎండీ అజాం పాల్గొన్నారు.

‘రెగ్యులర్ చేస్తామన్నారు.. అరెస్టు చేయించారు’


పోలీస్‌స్టేషన్‌లో ఏఎన్ఎంలు

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి.. రెగ్యులర్ చేయాలని అడిగితే అరెస్టు చేయిస్తున్నారని ఏఐటీయూసీ రెండో ఏఎన్ఎంల జిల్లా అధ్యక్షురాలు స్వరూపరాణి అన్నారు. రెండో ఏఎన్ఎంలు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వగా పోలీసులు ముందస్తుగా పలు ప్రాంతాల్లోని రెండో ఏఎన్ఎంలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండో ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న నిర్వహించనున్న రాత పరీక్షను వెంటనే రద్దు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్టు చేశారని సమాచారం మేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ వారికి సంఘీభావం ప్రకటించారు. రెండో ఏఎన్ఎంలు శారద, రజిత, రమాదేవి, రాజేశ్వరి, భూలక్ష్మి, వీణ, పద్మాంజలి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

సుల్తానాబాద్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఈర్ల స్వరూప బాధ్యతలు చేపట్టడంతో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పెద్దపల్లిలోని స్వరూప నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

రామగుండం: సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని మోడల్ విద్యాలయం విద్యార్థులకు మంగళవారం వివిధ అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వివరించారు. ప్రిన్సిపాల్ సదానందం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం అందించండి

జ్యోతినగర్: రామగుండం సర్కిల్ పరిధిలోని ఎన్టీపీసీ, రామగుండం, అంతర్గాం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అందించాలని రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. అనుమానిత వ్యక్తులు ఆయా కాలనీల్లో తిరుగుతున్న క్రమంలో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

కాల్వశ్రీరాంపూర్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం భోజన విరామ సమయంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. పీఎంటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచయ్య మాట్లాడుతూ మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. పీఎంటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచయ్య, జిల్లా అధ్యక్షుడు ఆకుల రమేశ్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సంధ్య, స్నేహలత, భాగ్యలక్ష్మి, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్, అనిల్, రాధాకృష్ణ, విజయ్, అనిత, నరేందర్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది అరెస్టు

కమాన్‌పూర్: చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని మంగళవారం కమాన్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. పెండింగ్‌లో ఉన్న సిబ్బంది వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో అసెంబ్లీకి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వారిలో బర్ల భూమయ్య, రాసకొండ బీమరాజు, మరాల రమేశ్, శంకర్, సంతోష్, సాకేత్, విజేందర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే పరిశీలన

ఎలిగేడు: మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో హరీఫ్ పరిశీలించారు. మండలంలోని లోకపేట, ముప్పిరితోట, ధూళికట్ట, రాములపల్లి గ్రామాల్లో యాప్‌లో సర్వే వివరాలు నమోదు చేస్తున్న తీరును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జూలపల్లి: జూలపల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కోసం సిబ్బంది నిర్వహిస్తున్న లబ్ధిదారుల వివరాల సేకరణను ఎంపీడీవో పద్మజ పరిశీలించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి ఉన్నారు.

ఓదెల: ఓదెలలో ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ సర్వేను మంగళవారం సీఈవో నరేందర్ పరిశీలించారు. అనంతరం ఓదెలలోని కస్తూరిబా బాలికల హాస్టల్‌ను సందర్శించారు. ఎంపీడీవో కార్యాలయంలోని ఉద్యోగుల పనితీరును, రికార్డులను పరిశీలించారు.

రామగిరి: మండలంలోని ఆదివారంపేట, రత్నాపూర్, నాగెపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను మంగళవారం ఎంపీడీవో శైలజారాణి మంగళవారం పరిశీలించారు. ఎంపీవో ఉమేశ్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, నాయకులు వరప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

• పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసు సిబ్బంది మంగళవారం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,480, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుళ్లు సదానందంగౌడ్, మహేందర్, కానిస్టేబుళ్లు ప్రకాశ్, మల్లేశ్, రాజేందర్, సంపత్ ఉన్నారు.

• ఎన్టీపీసీ భూనిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి

గోదావరిఖని: ఎన్టీపీసీ భూనిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. స్థానిక ఐఎఫ్‌టీయూ యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు ఏసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పవర్‌ప్లాంట్‌లో పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలన్నారు. అలాగే భూనిర్వాసితులందరికీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.10వేల పింఛన్ మంజూరు చేయాలన్నారు. నాయకులు నరేశ్, చిలుక శంకర్, అశోక్ పాల్గొన్నారు.

• తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన కొండ్ల చంద్రకళ తన తండ్రితో కలిసి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. ఆమె తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్రకళ భర్త రవీందర్ రెండో పెళ్లి చేసుకున్నాడని, తనకు తెలియకుండా తన భర్త 20గుంటల భూమిని అమ్మాడని వాపోయింది. ఫిర్యాదున్న భూమిని రెవెన్యూ అధికారులు ఎలా రిజిష్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించింది. తహసీల్దార్ సుమన్‌ను వివరణ కోరగా పట్టా దా రుడిపై పట్టా ఉండటంతో రిజిస్ట్రేషన్ చేశానని, ఏమైనా అభ్యంతరాలుంటే కోర్టును ఆశ్రయించాలన్నారు.

• ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రభుత్వం పథకాల పేరుతో డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్ఎంఈ పథకం పేరుతో యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్ తండాకు చెందిన దరావత్ రాజేశ్ నాయక్ అనే వ్యక్తి రెండు నెలల నుంచి నెలకు రూ.10వేలు వేతనం ఇప్పిస్తానంటూ పలువురు మహిళల నుంచి రూ.2600 నుంచి 5200 వరకు డబ్బులు వసూలు చేశాడు. కాగా అతడిని అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరు పరిచామని సీఐ పేర్కొన్నారు.

• సుందిళ్లలో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం సుందిళ్ల గ్రామానికి చెందిన బోడరాజు అనే ఆటో డ్రైవర్ ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం రాజు భార్యాపిల్లలతో కలిసి మూడురోజుల క్రితం వేరే ఊరికి వెళ్లాడు. సోమవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న పావుతులం బంగారంతో పాటు రూ.5వేల నగదు ఇంటి ముందున్న బైక్ చోరికి గురైనట్లు గుర్తించి రాజు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• పరామర్శ

ఓదెల: మండలంలోని గుండ్లపల్లెకు చెందిన ముక్కీస రాజిరెడ్డి ఇటీవల మృతిచెందారు. అతడి కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మాజీ సర్పంచు పులుగు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కొట్టె మహేందర్, నాయకులు పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, పులుగు నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత


నిత్యావసరాలు అందిస్తున్న కార్పొరేటర్ రమణారెడ్డి

జ్యోతినగర్: అగ్ని ప్రమాదంలో గూడు కోల్పోయిన కుటుంబానికి ఎన్ఆర్ఐ వ్యాళ్ల హరీశ్‌రెడ్డి వీహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఇంటి సామగ్రి, నిత్యావసర వస్తువులు అందించారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌కు చెందిన నిరుపేద గొర్ల విజయ ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. స్థానిక కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి విజ్ఞప్తి మేరకు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో రూ.10వేల విలువ గల బియ్యం, నిత్యవసర సరుకులు, ఇంటి సామగ్రి మంగళవారం అందజేశారు. కవితా రెడ్డి, సౌజన్య, వసంత, వీహెచ్ఆర్ ఫౌండేషన్ సభ్యులు రాము పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మంథని: స్థానిక ఫ్రెండ్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో సీఎం కప్–2024 బ్యాడ్మింటన్ అండర్–19 జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో 8 మంది బాలబాలికలు ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు.

కనుల పండువగా మహా పడిపూజ



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్‌లో సోమవారం రాత్రి శ్రీఅయ్యప్ప స్వామి మెట్లపూజ కనుల పండువగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఓదెలుయాదవ్ దంపతులు, హెచ్ఎం రవీందర్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి కేరళకు చెందిన శ్రీశ్రీశ్రీ ధనుష్ నంబూద్రి గురుస్వామి మెట్లపూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి ఫలపంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన సరస్వతీదేవి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. దాత, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, నేనున్నా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ ఆవిష్కరించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలకు క్రీడా వస్తువుల కొనుగోలుకు కొంజెర్ల వెంకటయ్య రూ.5వేలు హెచ్ఎం లచ్చయ్యకు అందజేశారు. దాతను ఆర్యవైశ్య, మైనార్టీ, అంబేడ్కర్ సంఘాలతో పాటు మాజీ వార్డు సభ్యులు సన్మానించారు. నాయకులు వేణుగోపాలరావు, ప్రదీప్‌కుమార్, మేర శ్రీనివాస్, లోక రవీందర్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే విద్యాలయంలో మంగళవారం క్షయపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ విష్ణు మాట్లాడుతూ క్షయపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అలాగే విద్యార్థులు తమ కుటుంబంలో అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నిక్షయ కార్యక్రమం ద్వారా ఉచితంగా మందులు అందిస్తుందని తెలిపారు. వైద్యులు బ్లెస్సీ, సూపర్‌వైజర్ సురేందర్, డీపీపీఎం ప్రభాకర్ ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఇన్సూరెన్స్ సిబ్బంది

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన భూంపెల్లి బాలకృష్ణ కుటుంబానికి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సంస్థ మంగళవారం రూ.5లక్షల చెక్కు అందజేసింది. బాలకృష్ణ 8నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో పాలసీ చేశాడు. కాగా బాలకృష్ణ భార్య రజితకు సేల్స్ మేనేజర్ అరుణామోహన్ గౌడ్ చెక్కు అందజేశారు. కొండి రమణ, వేముల శంకర్, మేకల తిరుపతి, సతీశ్ ఉన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

ధర్మారం: ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. రాజశేఖర్ మట్లాడుతూ 23, 24, 25వ తేదీల్లో సిద్దిపేట జిల్లాకేంద్రంలో నిర్వహించే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర కార్యదర్శి వంశీ, నాయకులు సంతోష్, అరవింద్, వరుణ్, నితిన్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఆవిర్భావ వేడుకలు ఆకట్టుకునేలా ఉండాలి


మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ఆకట్టుకునేలా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని సమావేశం హాలులో పాఠశాలల కరస్పాండెంట్లు, డాన్స్ మాస్టర్లు, సేవా సభ్యులతో సాంస్కృతిక కార్యక్రమాలు, తినుబండారాల ఫుడ్ స్టాల్స్, ఆకట్టుకునేలా ఎగ్జిబిషన్ షోలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సేవా అధ్యక్షురాలు అనిత, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, సేవా కోఆర్డినేటిం అధికారి హన్మంతరావు పాల్గొన్నారు.

మారుపేరు బాధితుల సమస్య పరిష్కరించాలి


వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మారుపేర్ల బాధితులు

గోదావరిఖని: సింగరేణి మారుపేర్ల బాధితుల సమస్య వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు మద్దెల దినేశ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న క్రమంలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సింగరేణిలో మారుపేర్ల బాధితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని అదుపులోకి తీసుకుని గోదావరిఖని వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని మంగళవారం సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. మద్దెల దినేశ్ మాట్లాడుతూ సమస్య పరిష్కరించకపోతే మారుపేరు కార్మికుల డిపెండెంట్‌లతో కలిసి ఆందోళన కార్యక్రమాలతో పాటు కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని పేర్కొన్నారు.

కాంట్రాక్టర్ బిల్లులు నిలిపివేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గోదావరిఖని: కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు ఇప్పించే వరకు కాంట్రాక్టర్ బిల్లులు నిలిపి వేయాలని కాంట్రాక్టు కార్మికులు మంగళవారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ నుంచి బకాయి వేతనం ఇప్పించే వరకు ఈపీటీఆర్ కంపెనీకి బిల్లులు నిలిపి వేయాలని కోరారు. ఈ ఏడాది మేకు సంబంధించిన వేతనాలు అందలేదని తెలిపారు. దీనిపై పలుమార్లు కాంట్రాక్టు పొందిన ఈపీటీఆర్ సంస్థను సంప్రదించినా సరైన స్పందన లేదన్నారు. అధికారుల జోక్యంతో కేవలం రూ.3వేలు మాత్రమే చెల్లించారన్నారు. వేతనాలు చెల్లించే వరకు ఈపీటీఆర్ కంపెనీకి బిల్లులు నిలిపివేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు గుండెబోయిన భూమయ్య, గోగుల వెంకటేశ్, సంతోష్, పనిగంటి అశోక్, సుంకరి సురేశ్, చంద్రగిరి సాయి, భరత్, రాపెల్ల శ్రీకాంత్, చిగురు లక్ష్మణ్, గుండెపు వినోద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రామగుండం: ఇటీవల అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో పలువురు మృతిచెందారు. బాధిత కుటుంబాలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పరామర్శించారు. పెద్దంపేటకు చెందిన రిటైర్డ్ టీజీబీకేఎస్ కరివేద రమేశ్‌రెడ్డి బంధువు కొలిపాక ప్రతాపరెడ్డి పార్థీవ దేహానికి నివాళి అర్పించారు. ముర్మూర్‌లో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ జూల రాజేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగ అతడిని పరామర్శించారు. అదే గ్రామంలో ఇటీవల జూల పోశం 10రోజుల క్రితం మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పట్టణంలోని దురిశెట్టి స్వరూపకు వారంరోజుల క్రితం శస్త్రచికిత్స జరగడంతో స్వయంగా ఇంటికి వెళ్లి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ ఆముల నారాయణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, కొలిపాక మధుకర్‌రెడ్డి, ఉప్పరి లక్ష్మణ్, మాడిశెట్టి రవీందర్ ఉన్నారు.

నిరసన దీక్ష విజయవంతం చేయండి

మంథని: తమ సమస్యల సాధనకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేసి కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిందని, ఏడాదైనా హామీలు అమలు కావడం లేదన్నారు. నిరసన దీక్షలో మున్సిపల్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నియామకం

ఎలిగేడు: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన మారం మల్లేశంయాదవ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు మారం మల్లేశంయాదవ్ పేర్కొన్నారు.



రామగుండం: కార్పొరేషన్ 22వ డివిజన్ పరిధి అబాది రామగుండం రహదారిలో ఉన్న పట్టణ ప్రకృతి వనం నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా ఆదరణ కోల్పోయింది. ప్రధాన రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి. పట్టణ ప్రకృతివనం లోపల మొక్కల పరిస్థితి దయనీయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ప్రకృతివనం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500